సాక్షి ఖమ్మం

ఆదివారం । 14 । జనవరి । 2024



కనుమరుగవుతున్న బసవన్న

ఏటా సంక్రాంతి సందర్భంగా వాకిళ్లలో బసవన్నలు సందడి చేయాల్సి ఉండగా... నానాటికీ ఆ సంస్కృతి కనుమరుగవుతోంది. 8లో



కాపు లేదు.. గెల రాలేదు

సత్తుపల్లి మండలంలో పలువురు రైతులు నాటిన ఆయిల్‌ఫామ్ మొక్కలకు గెలలు రాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
32° / 18°

వాతావరణం

జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం ఉష్ణోగ్రత పెరుగుతుంది. రాత్రివేళ మాత్రం చలిగాలుల ప్రభావం కనిపిస్తుంది.



పూజకు పూలు కొనుగోలు చేస్తున్న యువతులు



మధిరలోని ఓ ఇంటి ముందు వేసిన ముగ్గు



గాలిపటం తీసుకెళ్తున్న యువకులు

జిల్లా అంతటా సంక్రాంతి శోభ సంతరించుకుంది. కొత్త ధాన్యం ఇంటికి చేరుతున్న వేళ.. అందమైన ముగ్గులు, బొమ్మల కొలువులు, గొబ్బెమ్మలతో సందడి నెలకొంది. డూడూ బసవన్నలు, హరిదాసుల రాకపోకలతో ఊరూవాడ హడావుడిగా మారుతున్నాయి. కొత్త అల్లుళ్లు ఇంటికి వచ్చి పండుగను చిరస్మరణీయం చేసుకుంటుండగా.. పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో చిన్నారులు గాలిపటాలతో హుషారుగా గడుపుతున్నారు. కొత్త పంటలు ఇళ్లకు చేరుతున్న వేళ ఆ పంటలతో పిండివంటలు చేయడంలో మహిళలు నిమగ్నమయ్యారు. సంక్రాంతిని ఆనందంగా జరుపుకునేందుకు పట్టణాలు, నగరాల్లో ఉన్న వారు స్వస్థలాలకు వచ్చేశారు. ఈసారి ప్రభుత్వం మహిళలకు 'మహాలక్ష్మి' పేరిట ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో రైళ్లతో పోలిస్తే బస్సుల్లో ఎక్కువగా రద్దీ కనిపిస్తోంది. ఇక పొరుగునే ఉన్న ఏపీలో సంక్రాంతికి జరిగే కోడిపందేలు చూసేందుకు యువత ఉత్సాహం కనబరుస్తున్నారు. – ఖమ్మంగాంధీచౌక్



డూడూ బసవన్నల ఆటలు

సంబురాల సంక్రాంతి

- నేటి నుంచి మూడు రోజులు పండుగ
- వాకిళ్లలో ఆకట్టుకోనున్న రంగవల్లులు
- ప్రతీ ఇంట పిండివంటల ఘుమఘుమలు
- పతంగులతో పిల్లల సందడి
- ఏ ఇంట్లో చూసినా బంధుమిత్రుల హడావుడి



రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు

సంక్రాంతి పండుగను ఏటా జనవరి 13, 14, 15వ తేదీల్లో జరుపుకుంటారు. కానీ ఈ ఏడాది లీప్ సంవత్సరం కావడంతో 14, 15, 16 తేదీల్లో సంక్రాంతి వచ్చింది. ఇందులో భాగంగా ఆదివారం భోగి, సోమవారం మకర సంక్రాంతి, మంగళవారం కనుమ జరుపుకోనున్నారు. మరికొందరు నాలుగో రోజు ముక్కనుమగా కూడా జరుపుకుంటారు. తొలిరోజు భోగి మంటలు, రెండో రోజు పొంగలి, పిండివంటలతో పితృదేవతలు, దేవుళ్లను పూజించడం ఆనవాయితీగా వస్తోంది. మూడోరోజైన కనుమ సందర్భంగా గోపూజతో పాటు పిండివంటలు, మంచి ఆహారంతో పండుగ ఆనందంగా జరుపుకుంటారు.

నేడు భోగ భాగ్యాల భోగి

సంక్రాంతి పండుగ భోగితో ప్రారంభమవుతుంది. భోగి అంటే భోగభాగ్యాలు అనుభవించే రోజుగా జరుపుకోవడం ఆనవాయితీ. పాడిపంటలు ఇళ్లకు వచ్చే సమయం కావడంతో ప్రతీ ఇంటిముందు భోగి మంటలు వేస్తారు. పాతకు స్వస్తి చెప్పి నూతనత్వానికి స్వాగతం పలుకుతూ ఇళ్లలో పాత వస్తువులు, దుస్తులను భోగి మంటల్లో వేసి తొలగించుకుంటారు. బద్ధకం, అశ్రద్ధ, చెడు తలంపు ఈ మంటల్లో కాలిపోతాయని భావిస్తారు. ఇదేరోజు పిల్లలకు భోగి పండ్లు పోస్తారు.

సంక్రాంతి శోభ

రంగవల్లుల శోభలో దివ్యత్వం, కళా నైపుణ్యం గోచరిస్తాయి. ప్రతీ ఇంటి ముందు చుక్కలను కలుపుతూ అందమైన ముగ్గులు వేసి అందులో గొబ్బెమ్మలు పెడతారు. స్నానం, దానం, పితృతర్పణం, జపతపాలు, దేవతార్చనలు, సంక్రాంతి ముఖ్య విధులుగా శాస్త్రాలు నిర్దేశించాయి. దేవతలు, తల్లిదండ్రులు, సాటి మనుషులు, ప్రకృతిపై కృతజ్ఞత, ప్రేమను ప్రకటించే పండుగగా సంక్రాంతికి పేరుంది. సంక్రాంతి పర్వదినాన ఇచ్చే దానాలు అక్షయంగా లభిస్తాయని శాస్త్రోక్తి.

రైతుల పండుగ కనుమ

కనుమ పండుగను రైతులు ఘనంగా జరుపుకుంటారు. పాడి పశువులు, దొడ్లను శుభ్రంగా కడిగి, పూలతోరణాలతో కట్టి, మామిడి తోరణాలతో అలంకరిస్తారు. అలాగే, పశువులకు కుంకుమబొట్లు పెట్టి మెడలో పూలదండలు వేసి ప్రత్యేకమైన దాణా అందజేస్తారు. గోపూజ చేస్తారు. పంట చేల వద్ద రేగాకు, ఎముక, జిల్లేడు ఆకులను ఉంచి ఉదయాన్నే ఇంట్లో వండిన పులగాన్ని పంటలపై చల్లడం పూర్వకాలం నుంచి వస్తున్న ఆచారం.

బెంగుళూరు నుంచి వచ్చా..



కల్లూరు: సంక్రాంతి పండుగ కోసమే బెంగళూరు నుంచి వచ్చా. ఏటా ఈ పండుగను కుటుంబంతో కలిసి ఇష్టంగా సంప్రదాయ రీతిలో జరుపుకుంటాం. అందుకే ఎక్కడ ఉన్నా పండుగకు ఇంటికి వస్తాం. రకరకాల పిండి వంటలు చేసుకుని బంధువులతో ఆనందంగా గడుపుతాం.

– గోరింట్ల భారతి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

అమెరికాకు పంపించా..



సత్తుపల్లి టౌన్: మా కుమారుడు ప్రేమ్‌చంద్ – చైతన్య దీప్తి అమెరికాలో ఉంటారు. సంక్రాంతి పండుగ, పిండివంటలు అన్నా కోడి పందేలు అన్నా వాళ్లకు ఇష్టం. కానీ ఉద్యోగరీత్యా రాలేని పరిస్థితి. దీంతో స్వయంగా పిండి వంటలు చేసి పండుగ రోజున చేరేలా అమెరికాకు పంపించా.

– గంధ్ర జయ సోమిరెడ్డి, సత్తుపల్లి



పిండివంటలు చేస్తున్న మహిళలు

అరిసెలు, సకినాలు ప్రత్యేకం

తెలుగు పండుగల్లో సంక్రాంతి పండుగ ప్రత్యేకత ఉంది. దీన్ని అల్లుళ్ల పండుగగానూ పిలుస్తారు. ఈ పండుగలో పిండి వంటలకు అధిక ప్రాధాన్యం ఉంది. కొత్తగా పంటలు వచ్చాక జరుపుకునే తొలి పండుగ కావడంతో కొత్త బియ్యంతో చేసిన అరిసెలు, సకినాలు సిద్ధం చేస్తారు. ఇవి సంప్రదాయ వంటకాలే కాక ఆరోగ్యకరమైనవి. ఇప్పటికే పల్లె, పట్నం తేడా లేకుండా మహిళలు పిండి వంటల చేయడంలో నిమగ్నమయ్యారు. కొందరు ఇళ్లలో మరికొందరు సామూహికంగా చేస్తుండగా.. ఇంకొందరు కేటరింగ్ సెంటర్లలో ఆర్డర్ ఇచ్చి చేయించుకుంటున్నారు.



సకినాలు చుడుతున్న మహిళ

బరిలో కోడీ...

ఏపీ పందేలకు తెలంగాణ కోళ్లు !

- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పెంచుతున్న పలువురు
- ఒక్కో పుంజుకు రూ.5 వేలకు పైగానే ధర
- మెనూలో ఉన్నత స్థాయి జాగ్రత్తలతో సిద్ధం
- ముందస్తుగా తీసుకెళ్లిన పందెంరాయుళ్లు



ఇల్లెందులో పెంచుతున్న పందెం కోళ్లు



ఇల్లెందురూరల్: సంక్రాంతి పండుగ వస్తుందంటే ఇళ్లలో అరిసెలు, సకినాల తయారీ మొదలైనట్లుగా.. పందెంరాయుళ్లు కోడిపుంజులపై దృష్టి సారిస్తారు. సంక్రాంతి సమయాన మాత్రమే జరిగే ఈ పందేలు తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కొందరు దీన్ని జూదంగా మార్చినా సంప్రదాయంగా పోటీలు మాత్రం అనాదిగా కొనసాగుతున్నాయి. అయితే, పందెంలో గెలవాలంటే తొలుత కోడిపుంజును ఎంచుకోవడంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అందుకోసం పుంజులను కన్నబిడ్డల కంటే ఎక్కువ జాగ్రత్తగా పెంచి పోషించే పలువురు పందేలకు సిద్ధం చేస్తారు. ఇదే సమయాన మరికొందరు బలిష్టంగా ఉండే పుంజులను కొనుగోలు చేసి పందెంలో గెలిచేలా తర్ఫీదునిస్తారు. ఇందులో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు ఇళ్లు, తోటల్లో ఏడాదంతా పుంజులను పెంచి సంక్రాంతి సమయాన అమ్ముతుంటారు.

వ్యాపకం నుంచి వ్యాపారంగా

పల్లె సీమల్లో ప్రతి ఇంటా కోళ్లను పెంచుతారు. తెల్లవారుజామున కొక్కొరోకో అంటూ కూత వినిపించని పల్లెలు అరుదనే చెప్పాలి. ఇళ్ల ముందు పడిన ధాన్యం గింజలు తింటూ తిరిగే కోళ్లు ఎక్కడకు వెళ్లినా ఇప్పటికీ కనిపిస్తాయి. కొందరు కోళ్లను పెంపుడు పక్షుల్లా పెంచితే మరికొందరు పందేల కోసమే పెంచుతారు. పందెం కోడి పుంజులకు డిమాండ్ ఎక్కువగా ఉండటంతో వీటి పెంపకంపై నానాటికీ ఆసక్తి పెరుగుతోంది. ఖర్చు, శ్రమ ఎక్కువే అయినప్పటికీ మక్కువగా పెంచుతున్నారు. మంచి పందెం కోడిని సుదూర ప్రాంతాల నుంచి తెచ్చి పునరుత్పత్తి ద్వారా సంతతి పెంచుతూ.. జాగ్రత్తలు పాటిస్తూ పందేలకు సిద్ధం చేస్తారు. తద్వారా దీన్ని వ్యాపకంగా మార్చుకున్న పలువురు మంచి ఆదాయాన్ని సైతం పొందుతున్నారు.

పోటీలకు రెడీ..

కోడి పుంజులు విడివిడిగా పెరగడం వల్ల ఒక రకమైన కోపంతో ఉంటాయి. పైగా ఎదుటి కోడిని చూడగానే మీద పడి రంకెలు వేసేలా తయారవుతాయి. దీంతోపాటు కోడిపుంజులు పెంచేవారు సంకేతాలు ఇవ్వడంతో వాటిలో ఆగ్రహం కట్టలు తెంచుకుంటుంది. ఇలా తర్ఫీదు ఇచ్చిన అనంతరం పందేలకు తీసుకెళ్తారు. మిగతా కోళ్లకు పందేలను చూపిస్తారు. దీనివల్ల వాటికీ పౌరుషం పెరుగుతుంది. అంతేకాకుండా పందేనికి వెళ్లే ముందు రోజు ఇంటి పరిసరాల్లో కొద్ది సేపు శిక్షణ ఇస్తారు.

కొనుగోలు రూ.వేలల్లో.. పందెం రూ.లక్షల్లో..

సాధారణంగా కోడిపందేలు అనగానే పూర్వ ఉభయ గోదావరి జిల్లాలు గుర్తుకొస్తాయి. సంక్రాంతి పండుగ రోజుల్లో ఆయా ప్రాంతాల్లో కోడి పందేలు జోరుగా సాగుతాయి. ఈ సంస్కృతి ఏపీ సరిహద్దు అయిన ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనూ కనిపిస్తుంది. దీంతో పందెం కోళ్ల పెంపకం ఇక్కడ పెరుగుతూ వచ్చింది. ప్రారంభంలో సరదాగా ఉన్న ఈ కోళ్ల పెంపకం వాటి ధర రూ.వేలల్లో ఉండడంతో అనేక మంది వ్యాపారంగా మార్చుకున్నారు. రూ.5 వేల నుంచి రూ.20వేల వరకు పందెం పుంజుల ధర పలుకుతోంది. వీటిని కొనుగోలు చేసి తీసుకెళ్లే పందెంరాయుళ్లు మరింత శిక్షణ ఇచ్చి పోటీలకు సిద్ధం చేస్తారు.

ఆహారం, పెంపకం ఇలా..

పందెం కోళ్ల ఆహారం విషయంలో పెంపకందారులు అనేక జాగ్రత్తలు తీసుకుంటారు. కోళ్లకు సాధారణంగా జొన్నలు, సజ్జలు, రాగులు, మొక్కజొన్న వంటి ఆహారాన్ని అందిస్తారు. అదే కోళ్లను పందేలకు సిద్ధం చేయాల్సి వస్తే పోషణ, ఆహారం విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. పామాయిల్, మామిడితోటల్లో షెడ్లు వేసి పెంచుతున్నారు. వీటికి ఆహారంగా బాదంపప్పు, పిస్తా, పప్పు, ఎండు ద్రాక్ష, అంజూరు, ఆక్రూట్, కర్జూర, వాము, రాగిపిండి, సజ్జ పిండి పెడతారు. రోజు ఒక గుడ్డు కూడా తప్పనిసరి. వ్యాయామం కోసం రోజూ ఉదయం ఓ గంట, సాయంత్రం ఓ గంట కోళ్లను ఆరుబయట తిప్పుతూ వ్యాధులు సోకకుండా వైద్యాధికారుల సలహాలు పాటిస్తారు. అంతేకాకుండా ఉదయం, సాయంత్రం గోరు వెచ్చని నీళ్లతో స్నానం చేయించడం.. ఉదయం వాకింగ్ తర్వాత పిస్తా, బాదం, మధ్యాహ్నం చిరుధాన్యాలు, సాయంత్రం స్నానం చేయించాక మళ్లీ ఎండు ఫలాలను దాణాగా అందిస్తారు. అనంతరం కొంచెం మద్యాన్ని కూడా తాగిస్తారు. వారంలో ఒకసారి కుసుమ నూనెతో మర్దన చేస్తారు. కాగా, ఎట్టి పరిస్థితుల్లోనూ కోడి పుంజులను బయటకు వదిలిపెట్టరు. అంతే కాక రెండు కోళ్లు కలవకుండా ప్రతీ పుంజును ప్రత్యేక స్టాండ్లలో కాపాడుతారు.



మైల రకం పుంజు



డేగ రకం..



నెమలి రకం పుంజు

కోళ్లు.. పలు రకాలు

పందెం కోళ్లలో అనేక రకాలు ఉన్నాయి. ప్రధానంగా కోడి ఈకల రంగు ఆధారంగా కోడి రకాన్ని గుర్తిస్తారు. సేతు, డేగ, నెమలి(ఎర్ర నెమలి, నల్ల నెమలి), కాకి(నల్లకాకి, పచ్చకాకి), పర్ల(తెల్ల పర్ల, కాకిడేగ పర్ల,), రసంగి(నెమలి రసంగి), కిక్కిరాయి(ఎర్ర కిక్కిరాయి, తెల్ల కిక్కిరాయి), మైల, తెల్లఅబ్రాస్, కౌజు, మైల, పింగళ, ఎర్రపూల కోడి, బెరస.. తదితర పేర్లతో వీటిని పిలుస్తుంటారు. నల్ల ఈకలు ఉన్న పుంజును కాకి అని, తెల్లని ఈకలు ఉంటే దానిని సేతు అని, మెడపై నలుపు, తెలుపు ఈకలు సమానంగా ఉంటే పర్ల అని, శరీరం నల్లగా ఉండి, రెండు లేదా మూడు రంగుల ఈకలు ఉంటే దానిని కొక్కిరాయి అని వ్యవహరిస్తారు. ఇక ఈకలు మొత్తం ఎర్రగా ఉంటే డేగ అని, రెక్కలపై లేదా వీపుపై పసుపు రంగు ఈకలు ఉంటే నెమలి అని, మూడు రంగుల ఈకలు, నలుపు, ఎరుపు, పసుపు రంగుల్లో సమానంగా ఉంటే దానిని కౌజుగా, ఈకలు ఎరుపు, బూడిద రంగులో ఉంటే మైల అని, రెక్కలు ఎక్కువ తెలుపు రంగులో ఉంటే పింగళ అని, బంగారు రంగులో ఈకలు ఉంటే అబ్రాసు అని పిలుస్తారు. అయితే, ప్రధానంగా డేగ, కాకి, నెమలి రకాలనే కోడి పందేల్లో ఉపయోగిస్తారు.

న్యూస్‌రీల్

జమలాపురం ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజామున స్వామి మూలవిరాట్‌తో పాటు శ్రీవారి పాదానికి అర్చకులు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి నిత్య కల్యాణం జరిపించగా తెలంగాణ, ఏపీకి చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అలాగే, భక్తుల సమక్షాన అర్చకులు పల్లకీ సేవ నిర్వహించారు. ఈఓ జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుండి ఆరు రోజులు పుష్‌పుల్

ఖమ్మం మామిళ్లగూడెం: మూడో రైల్వేలైన్ పనులతో డోర్నకల్–విజయవాడ మార్గంలో నడిచే పుష్‌పుల్ రైలును రద్దు చేయగా సంక్రాంతి రద్దీ కారణంగా నడపాలని నిర్ణయించారు. డోర్నకల్–విజయవాడ(07755, విజయవాడ–డోర్నకల్(07756) పుష్‌పుల్ ప్యాసింజర్‌ను ఈనెల 14నుండి 20వ తేదీ వరకు నడిపించనున్నట్లు ఖమ్మం సీసీఐ ఎం.డీ.జాఫర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గడువుకు ముందే..

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తి

- ఐదు గ్యారంటీల కోసం 4,88,316 దరఖాస్తులు
- కేఎంసీ, బోనకల్ మినహా అన్నిచోట్ల ఎంట్రీ
- ప్రభుత్వ ఆదేశాలు రాగానే క్షేత్రస్థాయిలో విచారణ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ప్రజాపాలన సభల్లో భాగంగా ఐదు గ్యారంటీల కోసం స్వీకరించిన దరఖాస్తుల కంప్యూటరీకరణ ప్రక్రియ దాదాపు పూర్తయింది. ఒకటి, రెండు చోట్ల మినహా కంప్యూటర్ ఆపరేటర్లు చకచకా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసేశారు. ఆన్‌లైన్ నమోదుకు ప్రభుత్వం నిర్దేశించిన గడువు ఇంకా ఉన్నప్పటికీ.. అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చడంతో ఖమ్మం కార్పొరేషన్, బోనకల్ మండలంలో మినహా మిగిలిన అన్నిచోట్లా ముగిసింది.

ఇప్పటికే ఒకటి అమలు..

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ప్రకటించింది. ఇందులో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇప్పటికే అమల్లోకి రాగా.. మిగతా ఐదు గ్యారంటీల అమలు కోసం ప్రభుత్వం గతనెల 28 నుంచి ఈనెల 6వరకు ప్రజాపాలన సభల ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ 5వ తేదీ నుంచి మొదలైంది.

4.71 లక్షల మంది దరఖాస్తు

జిల్లావ్యాప్తంగా 4,71,425 మంది ప్రజాపాలన సభల్లో 4,88,316 దరఖాస్తులు అందజేశారు. దరఖాస్తులో రేషన్ కార్డు ప్రత్యేక కాలమ్ లేకపోవడంతో తెల్లకాగితంపై రాయించారు. దీంతో రేషన్‌కార్డు వినతిని కూడా ఒక దరఖాస్తుగా నమోదు చేయడంతో అధికారులు ప్రకటించిన సంఖ్య పెరిగింది. మొత్తంగా 4,91,012 దరఖాస్తుల కంప్యూటరీకరణ పూర్తవడంతో 100.55 శాతంగా వెల్లడించారు. అయితే కేఎంసీ పరిధిలో 1,00,736 కుటుంబాలకు గాను 81,211 దరఖాస్తులు ఇవ్వగా, ఇందులో 76,083 దరఖాస్తుల(93.69శాతం) ఆన్‌లైన్ నమోదు పూర్తయింది. బోనకల్ మండలంలో 14,698 కుటుంబాలకు గాను 16,811 దరఖాస్తులు రాగా, 16,589 దరఖాస్తుల(98.69శాతం) నమోదు పూర్తిచేశారు.



కొణిజర్లలో ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్ (ఫైల్)

ఖమ్మంరూరల్‌లో అత్యధికం..

ఖమ్మం కార్పొరేషన్‌ను మినహాయిస్తే ఖమ్మం రూరల్ మండలం నుంచి అత్యధికంగా ప్రజాపాలన దరఖాస్తులు అందాయి. ఇక్కడ 30,309 కుటుంబాలకు గాను 31,033 దరఖాస్తులు వచ్చాయి. ఆతర్వాత కూడా స్వీకరించిన దరఖాస్తులు, రేషన్‌కార్డు వినతులు కలిపి 31,499 దరఖాస్తుల నమోదు పూర్తయింది. ఆ తర్వాత కల్లూరు మండలం నుంచి 30,389 కుటుంబాలకు గాను 23,902 దరఖాస్తులు, నేలకొండపల్లి మండలంలో 18,383 కుటుంబాల నుంచి 22,350 దరఖాస్తులు వచ్చాయి.

క్షేత్రస్థాయిలో పరిశీలన..

దరఖాస్తుల వివరాలు కంప్యూటర్లలో నమోదు చేయడం పూర్తయిన నేపథ్యాన ఆ తదుపరి ప్రక్రియపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి సూచనలు అందాక అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిశీలించనుంది. దరఖాస్తుల్లో పొందుపర్చిన వివరాలను పోల్చుకుని పథకాల అమలుకు అర్హులను గుర్తించనున్నారు.

ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు, కంప్యూటరీకరణ వివరాలు..

మండలం	కుటుంబాలు	దరఖాస్తులు	ఆన్‌లైన్ ఎంట్రీ
మధిర	14,028	13,447	14,599
ఏన్కూరు	11,323	11,829	12,231
చింతకాని	14,673	19,275	19,890
తల్లాడ	15,944	19,623	20,133
ఎర్రుపాలెం	13,242	17,270	17,695
టి.పాలెం	20,113	22,311	22,809
సింగరేణి	16,112	19,183	19,556
సత్తుపల్లి	14,600	15,856	16,141
కొణిజర్ల	17,138	18,994	19,324
వేంసూరు	15,711	16,508	16,769
ఖమ్మం రూరల్	30,309	31,033	31,499
కల్లూరు	30,389	23,902	24,257
వైరా	11,498	12,356	12,535
కామేపల్లి	13,507	15,140	15,358
పెనుబల్లి	18,513	19,429	19,689
రఘునాథపాలెం	15,604	19,625	19,881
నేలకొండపల్లి	18,383	22,350	22,587
కూసుమంచి	16,963	21,630	21,848
ముదిగొండ	17,040	21,980	22,189
బోనకల్	14,698	16,811	16,589
ఖమ్మం కార్పొరేషన్	1,00,736	81,211	76,083
మధిర మున్సిపల్	12,793	9,175	9,620
సత్తుపల్లి మున్సిపల్	9,125	9,681	9,894
వైరా మున్సిపల్	8,983	9,697	9,836

పాలేరు నుండి ఖమ్మంకు తాగునీరు

తగ్గుతున్న రిజర్వాయర్ నీటిమట్టం

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్ నుండి ఖమ్మం నగర తాగునీటి అవసరాల నిమిత్తం 500 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. రానున్న వేసవిలో తాగునీటికి ఇక్కట్లు ఎదురుకాకుండా నిర్ణయం తీసుకున్నారు. కాగా, రిజర్వాయర్ నుంచి 24 గంటల పాటు నీరు సరఫరా చేయనుండగా, మున్నేరు అక్విడెక్ట్ నుండి నీరు వదిలి తాగునీటి అవసరాలు తీర్చనున్నారు.

తగ్గుతున్న పాలేరు నీటిమట్టం

పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం గణనీయంగా తగ్గిపోతోంది. పాలేరుకు సాగర్ జలాలు చేరకపోవడం.. ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు వినియోగిస్తుండడంతో నీటిమట్టం క్రమంగా తగ్గుతోంది. శనివారానికి రిజర్వాయర్ నీటి మట్టం 14.30అడుగులకు పడిపోగా ప్రతిరోజు 125.60 క్యూసెక్కుల నీటిని మిషన్ భగీరథ పథకానికి వినియోగిస్తున్నారు. సాగర్ నుండి నీరు వదలకపోతే త్వరలోనే రిజర్వాయర్ డెడ్ స్టోరేజీకి చేరనుంది. కాగా, ఆయకట్టులో సాగు చేసిన పంటలకు రిజర్వాయర్ నుండి పాలేరు కాల్వకు నీరు విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తుండగా అధికారులు మాత్రం ఏ నిర్ణయం తీసుకోవడం లేదు.

క్లుప్తంగా

జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక



బాలికల జట్టుతో అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లాస్థాయి జూనియర్ హ్యాండ్ బాల్ బాలికల జట్టును శనివారం ఎంపిక చేశారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన ఎంపిక పోటీలకు 46 మంది బాలికలు హాజరుకాగా, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.రఘునందన్, పీఈటీలు కృష్ణయ్య, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రవి, మౌనిక ఆధ్వర్యాన జిల్లా జట్టును ఎంపిక చేసి వివరాలు వెల్లడించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జట్టుకు ఎంపికైన వారిలో బి.నందిని, ఉషాశ్రీనేహ, ఎస్.నందిని, మీనాక్షి, కీర్తి, అనూష, సంధ్య, నిఖిత, శ్రీలత, సాయిప్రసన్న, స్వాతి, అలేఖ్య, తనుశ్రీ, ఇందు, అక్షయ ఉండగా, కోచ్‌గా దాసరి బలరామకృష్ణ వ్యవహరిస్తారు.

కోడి పందేలు నిర్వహిస్తే ఫిర్యాదు చేయండి

ఖమ్మంక్రైం: పోలీస్ కమిషనరేట్‌లో పరిధిలో ఎక్కడైనా కోడిపందేలు నిర్వహిస్తే వాట్సప్‌కు 87126 59123 నంబర్ ద్వారా సమాచారం ఇవ్వాలని సీపీ సునీల్‌దత్ ఒక ప్రకటనలో సూచించారు. అలాగే, డయల్ 100 ద్వారానైనా ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. అంతేకాకుండా టాస్క్‌ఫోర్స్ ఏసీపీ(87126 59180), ఖమ్మం ఏసీపీ(87126 59105), కల్లూరు ఏసీపీ(87126 59166), వైరా ఏసీపీ (87126 59146), ఖమ్మం రూరల్ ఏసీపీ (87126 59124)కి సైతం సమాచారం తెలియచేయాలని సూచించారు. ఫిర్యాదు చేసి వారి వివరాలు గోప్యంగా ఉంచి పందెం నిర్వాహకులను కట్టడి చేస్తామని సీపీ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్‌ఐ

కూసుమంచి: మండలంలోని జీళ్లచెరువులో నవంబర్ 27న నిర్వహించిన బీఆర్‌ఎస్ బహిరంగ సభలో తిరుమలాయపాలెం మండలం బీరోలుకు చెందిన మహేశ్ తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకోగా సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేశాడు. అలాగే, నెల కిందట మండలంలోని గోరీలపాడుతండాకు చెందిన తేజావత్ రవి కూడా సెల్‌ఫోన్‌ను పోగొట్టుకోగా సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయడంతో పోలీసులు గుర్తించారు. సెల్‌ఫోన్లను మహేశ్, రవికి శనివారం ఎస్‌ఐ రమేశ్‌కుమార్ అందజేశారు.

పోగొట్టుకున్న పర్సు..



పర్సు, సెల్‌ఫోన్ అందజేస్తున్న ఉద్యోగులు

ఇల్లెందు: ఖమ్మం నుంచి ఇల్లెందు వస్తున్న ఆర్టీసీ బస్సులో ఇల్లెందుకు చెందిన ప్రయాణికుడు పర్సు, సెల్‌ఫోన్ మరిచిపోయాడు. దీంతో డ్రైవర్, కండక్టర్ వాటిని ఇల్లెందు బస్టాండ్ పాయింట్‌లో సిబ్బందికి అందించారు. పర్సు మీద ఉన్న సెల్‌నంబర్ ఆధారంగా ప్రయాణికుడిని గుర్తించి పర్సు, సెల్‌ఫోన్ అప్పగించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్‌ను ప్రయాణికుడితోపాటు పలువురు అభినందించారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

ముదిగొండ: ఆస్తి తగాదాల కారణంగా ముదిగొండలో గురువారం పెట్రోల్ ఒంటిపై పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ముదిగొండకు చెందిన నాదెండ్ల కృష్ణప్రసాద్‌ను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ నరేశ్ తెలిపారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగేలా వ్యవహరించడంతో అరెస్ట్ చేశామని ఆయన వివరించారు.

సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాసం

దమ్మపేట: దమ్మపేట పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ రావు జోగేశ్వరరావుపై సొసైటీ డైరెక్టర్లు అవిశ్వాసం ప్రకటించారు. సొసైటీకి చెందిన 11 మంది డైరెక్టర్లు సంతకం చేసి అవిశ్వాస తీర్మానం ప్రతిని జిల్లా సహకార శాఖ అధికారికి పంపారు. కాగా ఫిబ్రవరి 2న సొసైటీ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు సీఈఓ నాగేశ్వరరావు తెలపగా, ఆ రోజు బల పరీక్ష జరగనుంది.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.12,448

కనుమరుగవుతున్న బసవన్న..



- సంక్రాంతికి పెద్దగా కనిపించని గంగిరెద్దుల సంచారం
- ఆదరణలేక భారంగా మారుతున్న బసవన్నల పోషణ
- కుటుంబాలు గడవక ఆడించేవారి అవస్థలు

పాల్వంచరూరల్: ఒకప్పుడు సంక్రాంతి వస్తుందంటే చాలు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో దూడూ బసవన్నలు సందడి చేసేవి. గంగిరెద్దులను ఆడించేవారు ప్రతి ఊరు తిరుగుతూ ప్రదర్శనలు ఇచ్చేవారు. పండుగకు మూడు రోజుల ముందు నుంచే వేకువజామున చలిలో ఇంటింటా తిరిగేవి. ఆయా గ్రామాల్లో వచ్చిన కానుకలు ఆరు నెలలపాటు కుటుంబ పోషణకు సరిపోయేవి. అయితే క్రమంగా గంగిరెద్దులు కనిపించకుండా పోతున్నాయి. గంగిరెద్దులతో ఊరూరా తిరిగినా తమకు, ఎద్దులకు కడుపు నిండటం లేదని గంగిరెద్దులు ఆడించేవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చిన్నపటినుంచే గంగిరెద్దులకు శిక్షణ

పాల్వంచ, కొత్తగూడెం, సుజాతనగర్ మండలాల్లో సుమారు 50 కుటుంబాలు గంగిరెద్దులు ఆడించేవారివి నివసిస్తున్నాయి. తరతరాలుగా ఇదే వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. వీరు ఎద్దులకు దూడలుగా ఉన్న సమయం నుంచే శిక్షణ ఇస్తారు. అనంతరం గ్రామాల్లో తిరుగుతూ భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తారు. సంక్రాంతి పండుగతోపాటు ఎవరైనా పెద్దవాళ్లు కాలం చేస్తే.. గంగిరెద్దులతో విన్యాసాలు చేయిస్తారు. ప్రజలు ఇచ్చే దానాలతో జీవనం సాగిస్తుంటారు. అయితే కాలక్రమంలో గంగిరెద్దులకు ఆదరణ కరువైంది. వీరికి వ్యవసాయ భూములు, ఇళ్లు కూడా లేవు. కాగా ప్రభుత్వం కరుణించి గంగిరెద్దులపై ఆధారపడి జీవనంసాగించే కుటుంబాలను గుర్తించి ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.







పట్టణాల్లో, పల్లెల్లో అక్కడక్కడా కనిపిస్తున్న బసవన్నలు

ఈ నాలుగు రోజులే..



తాత ముత్తాల నుంచి ఆచారంగా గంగిరెద్దులను ఆడించుకుంటూ జీవనం సాగిస్తున్నాం. సంక్రాంతి పర్వదినం సందర్భంగా మూడు, నాలుగు రోజులు అంతో ఇంతో ఆదాయం లభిస్తుంది. మిగిలిన రోజుల్లో సహాయం చేసేవారు ఉండరు. దీంతో పూటగడవడం కష్టంగా మారింది. – మొరం రమేష్, చాతకొండ

పింఛన్లు ఇవ్వాలి



గంగిరెద్దులను ఆడించుకుంటూ జీవనం సాగిస్తున్న నిరుపేద కుటుంబాలకు పోషణ భారమైంది. ప్రభుత్వం ద్వారా ఎలాంటి సహాయం అందడం లేదు. పట్టించుకునే దిక్కు లేదు. మా పరిస్థితిని గమనించి పింఛన్లు మంజూరు చేయాలి. – ఆవుల వెంకన్న, సాటివారిగూడెం

ఆదరణ కరువైంది



గతంలో సంక్రాంతి పండుగకు గ్రామాలకు వెళ్తే ఆరునెలలకు సరిపడా గాసం దొరికేది. ఇప్పుడు ఆదరణ కరువైంది. ఎన్ని గ్రామాలు తిరిగినా గంగిరెద్దు పోషణ కూడా లభించడంలేదు. వరిగడ్డి ధర విపరీతంగా పెరగడంతో ఎవరూ దానం ఇవ్వడంలేదు. – వీరన్న, రాజాపురం

● పుస్తక విలాపం..



శిథిలాల నుంచి పుస్తకాలను తీస్తున్న ఉద్యోగులు

శిథిలాల్లో పుస్తక భాండాగారం

- వెలికితీసి భద్రపరుస్తున్న లైబ్రరీ ఉద్యోగులు

జిల్లా కేంద్రంలోని గ్రంథాలయ సంస్థ పాత భవనం కుప్పకూలడంతో వేలాదిగా పుస్తకాలు శిథిలాల కింద ఉండిపోయాయి. మహిళలు, పిల్లల గ్రంథాలయంగా కొనసాగుతున్న ఈ భవనంలో దాదాపు 25 వేల పుస్తకాలు ఉన్నట్లు అంచనా. అలాగే, దినపత్రికల సెక్షన్ కూడా ఇందులోనే ఉంది. భవనం కూలడంతో శిథిలాల కింద పుస్తకాలు, పేపర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇక మిగిలిన సుమారు 500 పుస్తకాలను బస్తాల్లో నింపి కేంద్ర గ్రంథాలయంలో భద్రపరుస్తున్నారు. మరోపక్క భవనంలోని ఫర్నీచర్ పూర్తిగా దెబ్బతినగా శుక్రవారం కూడా శిథిలాల తొలగింపు కొనసాగింది. ఈ సందర్భంగా గ్రంథాలయ కార్యదర్శి ఎ.మంజువాణి పర్యవేక్షణలో ఉద్యోగులు పుస్తకాలను తీసి భద్రపరుస్తున్నారు. కాగా, పక్కనే ప్రమాదపుటంచుల్లో ఉన్న మరో భవనం స్థితిగతులను సంక్రాంతి తర్వాత పరిశీలించనున్నట్లు సమాచారం.

– ఖమ్మంగాంధీచౌక్

రిసార్ట్‌లో వీ.వీ.పాలెం సొసైటీ డైరెక్టర్లు



హైదరాబాద్ సమీపంలోని రిసార్ట్‌లో డైరెక్టర్లు

కోర్టులో కేవియట్ పిటీషన్ దాఖలు

ఖమ్మంఅర్బన్: డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం ప్రాతినిధ్యం వహిస్తున్న రఘునాథపాలెం మండలంలోని వీ.వీ.పాలెం పీఏసీఎస్ డైరెక్టర్లు అవిశ్వాసానికి లేఖ అందజేయడం చర్చనీయంగా మారింది. ఆయనను డీసీసీబీ చైర్మన్ పదవి నుంచి తొలగించాలంటే అక్కడ అవిశ్వాసం పెట్టకుండా సొసైటీలో పెట్టడమేమిటనే చర్చ జరుగుతోంది. కాగా, అవిశ్వాసం తీర్మానంపై సంతకం చేసిన డైరెక్టర్లను రావూరి సైదుబాబు ఆధ్వర్యాన జిల్లా కేంద్రానికి సమీపాన ఒక నేత ఫామ్‌హౌస్‌కు తీసుకెళ్లారు. అయితే, అవిశ్వాస తీర్మానంపై చర్చించేందుకు ఈ నెల 27న సమావేశం జరగనుండడంతో డైరెక్టర్లను హైదరాబాద్ సమీపంలోని ఒక రిసార్ట్‌కు పంపించారు. మొత్తం 11 మంది డైరెక్టర్లలో 10 మంది క్యాంపునకు వెళ్లగా ఇంకొకరు వ్యక్తిగత పనులపై ఖమ్మంలోనే ఉన్నట్లు తెలిసింది. బల పరీక్ష జరిగే రోజు నేరుగా వారిని వీ.వీ.పాలెం తీసుకురానున్నట్లు తెలిసింది. కాగా, అవిశ్వాసంపై చైర్మన్ కోర్టును ఆశ్రయించకుండా ముందు జాగ్రత్తగా డైరెక్టర్లు శుక్రవారం కోర్టులో కేవియట్ పిటీషన్ దాఖలు చేసినట్లు తెలిసింది. ఈ పిటీషన్ గడువు 90 రోజులుగా ఉండగా.. అప్పటిలోగా బలపరీక్ష పూర్తికానుంది.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తా..

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సన్మానిస్తున్న జర్నలిస్టులు

ఖమ్మంసహకారనగర్: జర్నలిస్టుల సమస్యలు తమ దృష్టిలో ఉన్నాయని, వాటి పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం వీడీవోఎస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని శనివారం టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్–143) యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ ఆధ్వర్యాన జర్నలిస్టులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జిల్లా ప్రజలు స్వేచ్ఛగా జీవించేలా సహాయ సహకారాలు ఉంటాయని వెల్లడించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసిన వారిలో జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లం శ్రీనివాస్, జాతీయ కార్యవర్గ సభ్యుడు వెన్నబోయిన సాంబశివరావుతో పాటు శెట్టి రజినీకాంత్, జానీపాషా, అడపాల నాగేందర్, రామిశెట్టి విజేత, అమరవరపు కోటేశ్వరరావు, గుద్దేటి రమేశ్‌బాబు, కొరకొప్పుల రాంబాబు, బిక్కి గోపి, యలమంద జగదీశ్, సాయి, కాపర్తి నరేంద్ర, శ్రీను, మంద మోహన్‌రావు, ముత్యాల కోటేశ్వరరావు, పానకాలరావు, పప్పుల వేణు, జీవన్‌రెడ్డి, జక్కుల రమణ తదితరులు ఉన్నారు.

జూదరుల అరెస్ట్

ముదిగొండ: మండలంలోని కమలాపురం, బాణాపురం గ్రామాల్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ జి.నరేశ్ తెలిపారు. వారి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, రూ.3,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చింతకాని: మండలంలోని నాగులవంచ రైల్వే కాలనీ గ్రామానికి చెందిన షేక్ మీరాసాహెబ్ (39) ఇటీవల గాయపడగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. రైల్వేస్టేషన్‌లో ఉన్న రేకుల షెడ్డును ఈ నెల 10న తొలగిస్తుండగా మీరాసాహెబ్ ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. ఈ క్రమంలో తలకు తీవ్ర గాయం కావడంతో ఖమ్మంలో చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా, కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజేందర్ తెలిపారు.

మిర్చితోటపై కలుపు మందు పిచికారీ



ఎండుతున్న మొక్కలను చూపిస్తున్న రైతు

కారేపల్లి: మిర్చితోటపై గుర్తుతెలియని వ్యక్తులు కలుపుమందు చల్లడంతో మొక్కలు చచ్చిపోయాయి. కారేపల్లి మండలం అనంతారంతండాకు చెందిన బోడ బాలాజీ 3.10 ఎకరాలు కౌలుకు తీసుకొని మిర్చి సాగు చేస్తున్నాడు. సుమారు రూ.6 లక్షలు పెట్టుబడి పెట్టగా, పంట చేతికొచ్చే క్రమంలో బాలాజీ అంటే గిట్టని వారు ఇటీవల కలుపు మందు పిచికారీ చేయగా 1.20 ఎకరాల్లో పంట ఎండిపోయింది. దీంతో బాలాజీ వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి కలుపుమందు పిచికారీ చేశారని తేల్చారు. ఘటనపై కారేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపాడు. కాగా, రైతును ఎంపీటీసీ బానోతు రమేశ్, సర్పంచ్ మాలోతు మారు సక్రు, గ్రామస్తులు సుడిగాలి భిక్షమయ్య తదితరులు పరామర్శించారు.

చోరీలు... ఆపై గంజాయి రవాణా

- ముగ్గురి అరెస్ట్, రూ.2.65 లక్షల సొత్తు రికవరీ
- వివరాలు వెల్లడించిన ఏసీపీ హరికృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ హరికృష్ణ



స్వాధీనం చేసుకున్న నగదు, గంజాయి

ఖమ్మంఅర్బన్: గంజాయి రవాణా, చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసి 2 కేజీల గంజాయి, ద్విచక్రవాహనాలు, బంగారం తదితర రూ.2.65 లక్షల విలువైన సొత్తు రికవరీ చేసినట్లు ఖమ్మం నగర ఏసీపీ హరికృష్ణ తెలిపారు. ఈ మేరకు ఖమ్మం అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శివరామయ్యతో కలిసి ఏసీపీ వివరాలు వెల్లడించారు. ఖమ్మం అర్బన్ సీఐ టి.శ్రీహరి సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు నంబర్ ప్లేట్ లేని మోటార్ సైకిల్‌పై కనిపించటంతో తనిఖీ చేశారు. ఇంతలోనే ఓ వ్యక్తిపారిపోగా మిగిలిన ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. వీరిని ఖమ్మంకు చెందిన సయ్యద్ మౌలానా అలియాస్ అఫ్రోజ్, మైనర్‌గా గుర్తించడంతోపాటు పారిపోయిన వ్యక్తిని ఖాసీంగా తేల్చి.. రెండు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

జల్సాలు.. నగదు కోసం చోరీలు

జల్సాలకు అలవాటు పడిన వీరు సులువుగా డబ్బు సంపాదించేందుకు ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయి తీసుకొచ్చి ఖమ్మం పరిసర ప్రాంతాల్లో అమ్ముకోవాలని ప్రయత్నించినట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో మౌలానా మహబూబాబాద్‌లో మోటార్ సైకిల్ దొంగతనం చేయగా, మైనర్ ఖమ్మం వన్‌టౌన్ ఏరియాలో ఓ స్కూటీని దొంగతనం చేసినట్లు తేలింది. అలాగే, వీరు ముగ్గురు ఐదు రోజుల కిందట శ్రీనగర్‌కాలనీలో వృద్ధురాలి మెడలో మూడు తులాల బంగారు గొలుసు చోరీ చేసినట్లు అంగీకరించారు. ఆ గొలుసును చిట్టి విజయేంద్ర ద్వారా మరిపెడ ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టారు. దీంతో మౌలానా, విజయేంద్రతో పాటు మైనర్‌ను అదుపులోకి తీసుకోగా ఖాసీం కోసం గాలిస్తున్నట్లుఏసీపీ తెలిపారు. కాగా, నిందితుల నుంచి రూ.2.65 లక్షల విలువైన రెండు మోటార్ సైకిళ్లు, తాకట్టు పెట్టిన బంగారు గొలుసు, రెండు కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు. రూ.25 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులను అరెస్ట్ చేయడంలో టాస్క్‌ఫోర్స్, ఖమ్మం అర్బన్ సిబ్బంది కీలకంగా వ్యవహరించారని తెలిపారు. సమావేశంలో సీఐలు శ్రీహరి, తిరుపతి, ఎస్‌ఐలు వీరేందర్, రాము, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తి ధ్వంసంపై కేసు నమోదు

రఘునాథపాలెం: రఘునాథపాలెంలో గౌడ సంఘానికి ప్రభుత్వం 29 ఏళ్ల లీజ్‌కు గాను కేటాయించిన స్థలంలోకి పక్క పొలానికి చెందిన వ్యక్తులు అక్రమంగా ప్రవేశించడమే కాకుండా ప్రహరీని ధ్వంసం చేసిన ఘటనపై కేసు నమోదైంది. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో గౌడ సంఘం బాధ్యులు బోర్డులు ఏర్పాటు చేసి ప్రహరీ నిర్మించారు. ఈ స్థలంలోకి గత నెల 28న వీరన్నతో పాటు, సక్కుబాయి, రాజేశ్, శిరీష, ఉపేందర్ తదితరులు ప్రవేశించి గోడను ధ్వంసం చేశారని సంఘం జిల్లా కార్యదర్శి కొడగంటి ఆంజనేయులు ఫిర్యాదు చేశాడు. దీంతో శనివారం కేసు నమోదు చేసినట్లు రఘునాథపాలెం సీఐ శ్రీధర్ తెలిపారు.

రేషన్ బియ్యం సీజ్

పాల్వంచరూరల్: రేషన్ బియ్యాన్ని విక్రయించేందుకు ఆటోలో తరలిస్తుండగా శనివారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని ఉల్వనూరు లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన బొలిశెట్టి నరేష్ ఆటోలో 11 క్వింటాళ్ల రేషన్ బియ్యం తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో లక్ష్మీదేవిపల్లి గ్రామశివారులో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు పట్టుకున్నారు. నరేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.శ్రీనివాస్ తెలిపారు.

మార్కెట్ కమిటీలను రద్దు చేస్తూ ఉత్తర్వులు?

పర్సన్ ఇన్‌చార్జిలుగా మార్కెటింగ్ శాఖ అధికారులు

ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ మార్కెట్ కమిటీలను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. ఆ స్థానంలో మార్కెటింగ్ శాఖ అధికారులను పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించినట్లు సమాచారం. జిల్లాలో ఖమ్మం, మధిర, వైరా, నేలకొండపల్లి, సత్తుపల్లి, కల్లూరు, ఏన్కూరు, మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్లు ఉండగా.. వీటిలో ఖమ్మం, వైరా, మధిర, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్లకు కమిటీలు ఉన్నాయి. ఖమ్మం మార్కెట్ చైర్‌పర్సన్‌గా దోరేపల్లి శ్వేత, వైరా మార్కెట్ చైర్మన్‌గా పసుపులేటి మోహన్‌రావు, మధిర చైర్మన్‌గా బందం శ్రీనివాసరావు, నేలకొండపల్లి చైర్‌పర్సన్‌గా నంబూరి శాంతతో కూడిన కమిటీలు కొనసాగుతున్నాయి.ఈ కమిటీలకు మరో ఎనిమిది నెలల నుంచి ఏడాది కాల పరిమితి ఉంది. అయితే, ఇటీవల రాష్ట్రంలో కొత్తప్రభుత్వం ఏర్పడగా నామినేటెడ్ పోస్టులను రద్దుచేస్తోంది. ఇందులో భాగంగానే మార్కెట్ కమిటీలను కూడా రద్దుచేసింది.

ఈమేరకు ఖమ్మం మార్కెట్‌కు వరంగల్ మార్కెటింగ్ శాఖ జేడీ మల్లేశం, మధిర, నేలకొండపల్లి మార్కెట్లకు వరంగల్ మార్కెటింగ్ శాఖ డీడీ రాజు, వైరా మార్కెట్‌కు జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ.అలీంను పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమిస్తూ జీఓ 67ను విడుదల చేసినటుల తెలిసింది. అయితే, అధికారులు మాత్రం తమకు ఉత్తర్వులు అందాల్సి ఉందని తెలిపారు.

ద్విచక్రవాహనాలు చోరీ

అశ్వారావుపేటరూరల్: వేర్వేరు చోట్ల పార్కింగ్ చేసి ఉన్న రెండు ద్విచక్రవాహనాలు చోరీకి గురయ్యాయి. అశ్వారావుపేటలోని వెలమబజారుకు చెందిన ఎస్‌కే పాషా శుక్రవారం రాత్రి తన ద్విచక్రవాహనాన్ని ఇంటి ముందు, వినాయకపురం గ్రామానికి చెందిన జల్లిపల్లి విశ్వేశ్వరరావు శనివారం ఉదయం స్థానిక వెంకటేశ్వర లాడ్జి వద్ద తన ద్విచక్రవాహనాన్ని పార్కింగ్ చేశారు. కాగా రెండు వాహనాలను గుర్తుతెలియని దుండగులు అపహరించుకుపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై పి.శ్రీకాంత్ దర్యాప్తు చేపట్టారు.

అడ్డంగా దొరికిన 'రింగ్' మాస్టర్

ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ పేరిట చంద్రబాబు భూ దోపిడీ

- చంద్రబాబు, నారాయణ, లింగమనేని భూములను ఆనుకుని అలైన్‌మెంట్
- ముందుగా అనుకున్న అలైన్‌మెంట్‌కు కన్సల్టెన్సీ ద్వారా రాజముద్ర
- తద్వారా పచ్చ ముఠా భూముల విలువ అమాంతం పెంపు
- రూ.2 వేల కోట్లకుపైగా దోపిడీ
- పూర్తి ఆధారాలతో వెలికి తీసిన సీఐడీ



సాక్షి, అమరావతి: కట్టని రాజధాని.. నిర్మించని ఇన్నర్ రింగ్ రోడ్.. కావేవీ భూ దోపిడీకి అనర్హం అన్నట్టుగా టీడీపీ ప్రభుత్వ హయాంలో సీఎంగా చంద్రబాబు చెలరేగిపోయారు. రాజధాని అమరావతి ముసుగులో యథేచ్ఛగా భూ దందా సాగించారు. కాగితాల మీదే ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో ఇష్టానుసారం మార్పులు చేసి, వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టడం తనకే సాధ్యమని నిరూపించారు. గత ప్రభుత్వంలో సీఆర్‌డీఏ చైర్మన్‌గా అప్పటి సీఎం చంద్రబాబు, వైస్ చైర్మన్‌గా అప్పటి మంత్రి పొంగూరు నారాయణ బరితెగించి పాల్పడ్డ అవినీతి విస్మయ పరుస్తోంది. అందుకోసం లింగమనేని రమేశ్‌తో క్విడ్ ప్రో కోకు పాల్పడిన ఈ కేసులో లోకేష్ కూడా ప్రధాన పాత్ర పోషించారు. చంద్రబాబు బినామీ, సన్నిహితుడు లింగమనేని భూముల మార్కెట్ విలువ రూ.177.50 కోట్ల నుంచి రూ.877.50 కోట్లకు.. రాజధాని నిర్మాణం అనంతరం ఏకంగా రూ.2,130 కోట్లకు చేరేలా ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌ను ఖరారు చేయడం భారీ దోపిడీకి నిదర్శనం. ఈ అవినీతి పాపంలో చంద్రబాబు దత్తపుత్రుడు పవన్ కల్యాణ్‌కు కూడా వాటా ఇవ్వడం కొసమెరుపు. ఈ కుంభకోణాన్ని సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) పూర్తి ఆధారాలతో సహా వెలికి తీసి కేసు నమోదు చేసింది.

అలైన్‌మెంట్ బాబుది.. ముద్ర కన్సల్టెన్సీది

అమరావతిలో ఇన్నర్ రింగ్ రోడ్ కోసం సీఆర్‌డీయే అధికారులు 94 కిలోమీటర్ల పొడవుతో అలైన్‌మెంట్ రూపొందించారు. ఆ ప్రకారం అమరావతిలోని చంద్రబాబు, లింగమనేని, నారాయణ కుటుంబాలకు చెందిన భూములకు 3 కి.మీ. దూరం నుంచి పెద్దమరిమి, నిడమర్రు, చిన వడ్లపూడి, పెద వడ్లపూడి మీదుగా ఇన్నర్ రింగ్ రోడ్ నిర్మించాలి. దాంతో తమ భూముల విలువ పెరగదని గ్రహించిన చంద్రబాబు, నారాయణ.. సీఆర్‌డీయే అధికారులపై మండిపడ్డారు. వారిద్దరి ఆదేశాలతో సీఆర్‌డీయే అధికారులు ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు చేశారు. అలైన్‌మెంట్‌ను 3 కిలోమీటర్లు దక్షిణానికి జరిపి.. తాడికొండ, కంతేరు, కాజాలలోని చంద్రబాబు, లింగమనేని కుటుంబాలకు చెందిన 355 ఎకరాలు, హెరిటేజ్ ఫుడ్స్‌కు చెందిన 13 ఎకరాలను ఆనుకుని నిర్మించేలా ఖరారు చేశారు. ఆ విషయాన్ని గోప్యంగా ఉంచి చంద్రబాబు, నారాయణ తమ కుటుంబ సంస్థలు హెరిటేజ్, రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్‌లతోపాటు తమ బినామీ లింగమనేని రమేష్ సంస్థల పేరిట ఇన్నర్ రింగ్ రోడ్డుకు అటూ ఇటూ భారీగా భూములు కొన్నారు. అనంతరం సింగపూర్‌కు చెందిన సుర్బానా జ్యురాంగ్ కన్సల్టెన్సీని రంగంలోకి తెచ్చారు. అప్పటికే ఖరారు చేసిన ఇన్నర్ రింగ్ రోడ్ డిజైన్‌ను అమరావతి మాస్టర్ ప్లాన్‌లో చేర్చారు. అనంతరం ఎస్టీయూపీ అనే కన్సల్టెన్సీని నియమించారు. కానీ మాస్టర్ ప్లాన్‌లో పొందు పరిచిన అలైన్‌మెంట్‌కు అనుగుణంగానే ఉండాలని షరతు విధించారు. అంటే అప్పటికే సీఆర్‌డీయే అధికారుల ద్వారా తాము ఖరారు చేసిన అలైన్‌మెంట్‌నే ఎస్టీయూపీ కన్సల్టెన్సీ ద్వారా ఆమోదించేలా చేశారు.

రూ.177.50 కోట్ల నుంచి రూ.877.50 కోట్లు

ఎత్తుగడల వల్ల చంద్రబాబు, లింగమనేని రమేశ్ కుటుంబాలకు చెందిన భూముల విలువ భారీగా పెరిగింది. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారుకు ముందు ఆ ప్రాంతంలో ఎకరా భూమి మార్కెట్ ధర ప్రకారం ఎకరా రూ.50 లక్షలు ఉండేది. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ తర్వాత మార్కెట్ ధర ప్రకారం ఎకరా రూ.2.50 కోట్లు పలికింది. అంటే 355 ఎకరాల విలువ మార్కెట్ ధర ప్రకారం అమాంతం రూ.887.50 కోట్లకు పెరిగినట్టే. ఇక రాజధాని అమరావతి నిర్మాణం పూర్తయితే ఎకరా విలువ సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో రూ.4 కోట్లకు చేరుతుందని సీఎం హోదాలో చంద్రబాబు ప్రకటించారు. ఇన్నర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న భూముల విలువ ఎకరా రూ.6 కోట్లకు చేరుతుందని అంచనా వేశారు. అంటే అమరావతి నిర్మాణం పూర్తయితే ఆ 355 ఎకరాల విలువ ఏకంగా రూ.2,130 కోట్లకు చేరుతుందని అంచనా. మార్కె ట్ ధర ప్రకారం హెరిటేజ్ ఫుడ్స్ 9 ఎకరాల విలువ రూ.4.50 కోట్ల నుంచి రూ.22.50 కోట్లకు పెరిగింది. రాజధాని నిర్మాణం పూర్తయితే అది రూ.54 కోట్లకు చేరుతుందని లెక్క తేలింది.

పవన్ కల్యాణ్‌కూ 2.40 ఎకరాల ప్యాకేజీ

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కూడా ఈ ఇన్నర్ రింగ్ రోడ్డు అవినీతి పాపంలో పిడికెడు వాటా ఇచ్చారు. ఈ రోడ్డు అలైన్‌మెంట్‌కు సమీపంలోనే ఆయనకు 2.4 ఎకరాల భూమి ఉంది. లింగమనేని కుటుంబం నుంచి ఆ భూములను ప్రభుత్వ ధర ప్రకారం ఎకరా రూ.8 లక్షలు చొప్పున కొనుగోలు చేసినట్టు చూపించారు. ల్యాండ్ పూలింగ్ నుంచి మినహాయింపు కల్పించిన భూమినే పవన్ కల్యాణ్‌కు ఇవ్వడం గమనార్హం.

బాబు, నారాయణ ఆస్తుల అటాచ్‌మెంట్

క్విడ్ ప్రో కో కింద చంద్రబాబు పొందిన కరకట్ట నివాసాన్ని, నారాయణ కుటుంబ సభ్యులు సీడ్ క్యాపిటల్‌లో పొందిన 75,888 చదరపు గజాల ప్లాట్లు, కాలు మొత్తంగా పొందిన రూ.1.92 కోట్లను అటాచ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది.

ఐఆర్ఆర్ కేసులో నిందితులు

ఏ-1: చంద్రబాబు, ఏ-2: నారాయణ
ఏ-3: లింగమనేని రమేష్, ఏ-4: లింగమనేని వెంకట సూర్య రాజశేఖర్, ఏ-5: కేపీవీ అంజని కుమార్ (రామకృష్ణ హౌసింగ్ కార్పొరేషన్)
ఏ-6: హెరిటేజ్ ఫుడ్స్, ఏ-7: ఎల్ఈపీఎల్ ప్రాజెక్ట్స్, ఏ-14: లోకేశ్

కృష్ణా నదికి ఇవతలా అవినీతి మెలికలే

- సీఆర్‌డీఏ అధికారులు మొదట రూపొందించిన అలైన్‌మెంట్ ప్రకారం ఇన్నర్ రింగ్ రోడ్డును గుంటూరు జిల్లాలోని అమరావతి నుంచి కృష్ణా జిల్లాలోని నున్న మీదుగా నిర్మించాల్సి ఉంటుంది. అందుకోసం గుంటూరు జిల్లాలోని నూతక్కి – కృష్ణా జిల్లా పెద్దపులిపర్రు మధ్య కృష్ణా నదిపై వంతెన నిర్మించాలి. అక్కడి నుంచి తాడిగడప – ఎనికేపాడు మీదుగా నున్న వరకు ఇన్నర్ రింగ్ రోడ్డు కొనసాగుతుంది. అలా నిర్మిస్తే నారాయణ సంస్థల భవనాలను భూసేకరణ కింద తొలగించాల్సి వస్తుంది.
- ఈ అలైన్‌మెంట్‌పై నారాయణ సీఆర్‌డీఏ అధికారులపై మండిపడ్డారు. ఆయన ఆదేశాలతో ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను 3 కి.మీ. తూర్పు దిశగా మార్చారు. ఆ ప్రకారం గుంటూరు జిల్లాలో రామచంద్రాపురం – కృష్ణా జిల్లా చోడవరం మధ్య వంతెన నిర్మిస్తారు. అక్కడి నుంచి పెనమలూరు మీదుగా నిడమానూరు నుంచి నున్న వరకు ఇన్నర్ రింగ్ రోడ్డును నిర్మిస్తారు. దాంతో నారాయణ కుటుంబానికి చెందిన 9 విద్యా సంస్థల భవనాలను ఆనుకుని ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్ మెంట్‌ను ఖరారు చేశారు.

'హెరిటేజ్ ఫుడ్స్'కు భూములు

- ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను మెలికలు తిప్పడం ద్వారా లింగమనేని కుటుంబానికి కల్పించిన ప్రయోజనానికి ప్రతిగా చంద్రబాబు హెరిటేజ్ ఫుడ్స్‌కు భూములు పొందారు. ఈ ప్రక్రియలో అప్పటి హెరిటేజ్‌ఫుడ్స్ డైరెక్టర్ హోదాలో లోకేశ్ కీలక భూమిక పోషించారు. ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను ఆనుకుని ఉన్న కంతేరు గ్రామంలో హెరిటేజ్ ఫుడ్స్‌కు 10.4 ఎకరాలు పొందారు.
- 2014 జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య ఈ భూములను హెరిటేజ్ ఫుడ్స్ కొనుగోలు చేసినట్టు చూపించారు. అంతే కాకుండా లింగమనేని కుటుంబం నుంచి మరో 4.55 ఎకరాలు కొనుగోలు పేరిట హెరిటేజ్ ఫుడ్స్ దక్కించుకుంది. కానీ అప్పటికే ఈ కుంభకోణం గురించి బయటకు పొక్కడంతో ఆ సేల్ డీడ్‌ను రద్దు చేసుకున్నారు. ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను ఆనుకునే లింగమనేని కుటుంబానికి చెందిన 355 ఎకరాలతోపాటు హెరిటేజ్ ఫుడ్స్ భూములు ఉండటం గమనార్హం.
- క్విడ్ ప్రో కోలో భాగంగా లింగమనేని రమేశ్ కృష్ణా నది కరకట్ట మీద ఉన్న తమ బంగ్లాను చంద్రబాబుకు ఇచ్చారు. దీనిపై కేసు నమోదు కావడంతో ఈ వ్యవహారానికి మసి పూసేందుకు చేసిన యత్నాలు బెడిసికొట్టాయి. ఆ బంగ్లాను అద్దెకు ఇచ్చానని లింగమనేని రమేశ్ చెప్పారు. కానీ ఆయన అద్దె వసూలు చేసినట్టుగానీ చంద్రబాబు చెల్లించినట్టుగానీ ఆదాయ పన్ను వివరాల్లో లేవు.
- తర్వాత ఆ ఇంటిని ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చానని చెప్పారు. మరి అప్పటి చంద్రబాబు ప్రభుత్వం నుంచి హెచ్ఆర్ఏ ఎందుకు పొందారని ప్రశ్నించేసరికి జవాబే లేదు. దాంతో ఆ బంగ్లాను చంద్రబాబుకు వ్యక్తిగతంగా క్విడ్ ప్రో కో కింద ఇచ్చారన్నది స్పష్టమైంది.


సంక్రాంతి వేడుకలకు ముస్తాబవుతున్న తాడేపల్లిలోని సీఎం జగన్ నివాస ప్రాంగణం

సీఎం జగన్ ఇంట నేడు సంక్రాంతి సంబరాలు

సాక్షి, అమరావతి: ముత్యాల ముగ్గులు, మన సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంట నేడు సంక్రాంతి శోభ వెల్లివిరియనుంది. రైతులు, పల్లె ప్రజలతో కలిసి ఏటా సంక్రాంతి వేడుకలు నిర్వహించుకోవడం సీఎం జగన్‌కు ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా ఈనెల 14న (ఆదివారం) సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించనున్నారు. నవరత్నాలతో ముఖ్యమంత్రి ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలను అందించిన నేపథ్యంలో గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రాలు, మెడికల్ కాలేజీ, నాడు–నేడు స్కూల్, పాల కేంద్రం నమూనాలు, ఎండ్లబండ్లు, గ్రామీణ ఇళ్లతో పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించేలా ఏర్పాటుచేశారు. హైదరాబాద్ నుంచి వచ్చిన కళాకారులు వీటిని అద్భుతంగా తీర్చిదిద్దారు. వందేళ్ల క్రితం తిరుమల ఏ విధంగా ఉండేదో అదే తరహాలో ఇక్కడ ప్రత్యేకంగా సెట్టింగ్ ఏర్పాటుచేశారు.

సీఎం జగన్ సంక్రాంతి శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి అంటేనే అచ్చ తెలుగు పండుగని.. గ్రామానికి నూతన శోభను తెచ్చే పర్వదినమని.. మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే రోజని ఆయన అన్నారు. భోగి మంటలు.. రంగ వల్లులు.. హరిదాసుల కీర్తనలు.. గంగిరెద్దుల ఆటలు, గాలి పటాల సందళ్లు, పైరుపచ్చల కళకళలు.. రైతు లోగిళ్లలో ధాన్యం రాశులు.. పిండి వంటల ఘుమఘుమలు.. బంధుమిత్రుల సందళ్లతో కనువిందు చేసే మనందరి పండుగ సంక్రాంతి అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

నిరుద్యోగులకు సంక్రాంతి కానుక

- పండుగ తరువాత మెగా డీఎస్సీ నోటిఫికేషన్
- విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడి

సాక్షి, విశాఖపట్నం/సాక్షి, అమరావతి: ఏపీలో టీచర్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ప్రభుత్వం సంక్రాంతి కానుక ప్రకటించింది. పండుగ తరువాత మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. విశాఖ ఎయిర్‌పోర్టులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉద్యోగాల భర్తీ, విధి విధానాలు త్వరలో ప్రకటిస్తామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఏ హామీలిచ్చారో వాటన్నింటినీ తూచా తప్పకుండా అమలుచేశారని ఆయన గుర్తుచేశారు. ప్రజాసంకల్ప యాత్రలో ప్రజల సమస్యలను అతి దగ్గరగా చూసి వాటిని వంద శాతం అమలుచేసి దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రికార్డు సృష్టించారన్నారు. మహానేత వైఎస్సార్ హయాంలో ఏపీ అభివృద్ధి బాటపడితే.. ఇప్పుడాయన తనయుడు జగన్ హయాంలో అంతకు రెట్టింపు అభివృద్ధి, సంక్షేమం ఏపీలో జరిగిందన్నారు.

మూడు నెలల క్రితమే వివరాల సేకరణ

మరోవైపు.. అన్ని జిల్లాల్లోను వివిధ మేనేజ్‌మెంట్లలో ఉన్న ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను అందించాలని మూడునెలల క్రితమే డీఈఓలు, ఆర్జేడీలకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీచేసి, వివరాలు సేకరించింది. డైరెక్ట్ నియామకాలకు అనుగుణంగా పోస్టుల రోస్టర్ రిజిస్టర్లతో సహా సమగ్ర సమాచారాన్ని డీఎస్సీ నోటిఫికేషన్ సూచించిన ప్రొఫార్మాలో తీసుకున్నారు. అన్ని అంశాలను క్రోడీకరించి, ఖాళీల ఆధారంగా ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వనుంది.

16న శ్రీ సత్యసాయి జిల్లాలో ప్రధాని పర్యటన

సాక్షి, అమరావతి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 16వ తేదీన శ్రీ సత్యసాయి జిల్లా పాలసముద్రంలో పర్యటించనున్నారు. ఆరోజు మధ్యాహ్నం ప్రధాని పాలసముద్రంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్‌ను సందర్శిస్తారు. అనంతరం జరిగే సభలో పాల్గొంటారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి శనివారం అధికారులతో సమీక్షించారు. ప్రధాన మంత్రి పర్యటనలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు.

జిల్లా వార్తలు

రామయ్య శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం


దాతలకు రశీదు అందజేస్తున్న ఉద్యోగులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు శనివారం విరాళాలు అందజేశారు. హైదరాబాద్‌లోని మణికొండకు చెందిన తాడికొండ గౌరీహరిణి రూ.లక్ష, అమీన్‌పూర్‌కు చెందిన శ్రీరంగం కార్తీక్ శ్రీరాం లక్ష్మి, లావణ్య రూ.లక్ష విరాళాన్ని అధికారులకు అందజేశారు. అనంతరం వారు కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకుని పూజలు చేయగా అధికారులు జ్ఞాపికతో పాటు ప్రసాదం అందజేశారు. ఆలయ ఉద్యోగి సాయి పాల్గొన్నారు.

వచ్చేనెల 2న జేబీసీసీఐ కమిటీ సమావేశం

సింగరేణి(కొత్తగూడెం): జేబీసీసీఐ–11 వేతన రెండో సాండర్డైజేషన్ కమిటీ సమావేశం వచ్చేనెల 2న కోల్‌కత్తాలో జరగనుంది. ఈసమావేశం కోలకత్తాలో కోల్‌భవన్‌లో జరుగుతుందని కోలిండియా ఈడీ అండ్ ఈఈడీ జనరల్ మేనేజర్ గౌతం బెనర్జీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కోలిండియా పరిధిలోని ఎనిమిది రాష్ట్రాల్లో ఉన్న బొగ్గు పరిశ్రమల అధికారులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా 11వ వేతన ఒప్పందానికి సంబంధించిన అగ్రిమెంట్లు, కార్మికులకు కల్పించాల్సిన సౌకర్యాలు, ఇతర అలవెన్స్‌లపై చర్చిస్తారు.

కిన్నెరసానిలో ఐటీడీఏ పీఓ



పాల్వంచరూరల్: పాల్వంచ మండలంలోని పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ కుటుంబసమేతంగా శనివారం సందర్శించారు. డీర్ పార్కులోని దుప్పులు, కిన్నెరసాని డ్యామ్ పైనుంచి జలాశయాన్ని వీక్షించిన అనంతరం రిజర్వాయర్‌లో బోటు షికారు చేశారు.

కాపు లేదు.. గెల రాలేదు

- ఆరేళ్లయినా ఫలితం లేని ఆయిల్‌పామ్ మొక్కలు
- నాసిరకం మొక్కల సరఫరానే కారణమని ఆరోపణ
- రూ.లక్షల్లో నష్టపోయామని ఆవేదన



ఆరేళ్లయినా గెలలు రాని ఆయిల్‌పామ్ చెట్టు వద్ద రైతులు (ఇన్‌సెట్) తోటలో చనిపోయిన ఆరేళ్ల వయస్సు చెట్టు


ఐదేళ్ల వయస్సు చెట్టును నరికేసి నాటిన కొత్త మొక్క

సత్తుపల్లిరూరల్: నాసిరకం ఆయిల్‌పామ్ మొక్కలు సరఫరా చేయడంతో నట్టేట మునిగామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్కలు నాటి ఆరేళ్లు కావొస్తున్నా కాపు రాకపోవటంతో లబోదిబోమంటున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలోని నర్సరీ నుంచి ప్రభుత్వ సబ్సిడీతో సత్తుపల్లి మండలం నారాయణపురానికి చెందిన పుచ్చకాయల సోమిరెడ్డి, రమేశ్‌రెడ్డి తదితరులు 750 ఆయిల్‌పామ్ మొక్కలు తెచ్చి నాటారు. ఎకరానికి 57 మొక్కలు నాటగా వాటిలో చనిపోయి, కాపునకు రాని మొక్కలే 40 నుంచి 45 మొక్కల వరకు ఉన్నాయి. ఇక మూడేళ్లకే పంట దిగుబడి రావాల్సినా అలా జరగకపోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. నాసిరకం మొక్కలు సరఫరా చేయడంతోనే ఇలా జరిగిందని చెబుతుండగా.. మొక్కలు నాటిన రెండేళ్ల నుంచి ఎకరానికి 10 నుంచి 15 మొక్కలు చనిపోతుండటంతో మళ్లీ కొత్తవి నాటినట్లు రైతులు తెలిపారు.

పరిహారం ఇవ్వాల్సిందే..

అశ్వారావుపేట ఆయిల్‌పామ్ నర్సరీల నుంచి నాణ్యమైన మొక్కలు సరఫరా చేయకపోవడం వల్లే తాము నష్టపోయామని రైతులు ఆరోపిస్తున్నారు. మొక్కలు నాటి ఆరేళ్లయినా గెలలు రాకపోవటం.. అడపాదడపా చిన్నపాటి గెలలే వేయటం, గిడస బారి ఎదుగుదల లేకపోవటంతో రూ.లక్షల్లో నష్టం వాటిల్లిందని వాపోయారు. నాసిరకం మొక్కలు ఇచ్చినందుకు ఆయిల్‌ఫెడ్ బాధ్యత వహించి ఎకరాకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పక్కనే ఉన్న ఏపీలో కూడా ఇలాగే జరిగితే అక్కడి ప్రభుత్వం పరిహారం ఇచ్చిందని.. అదే తరహాలో తెలంగాణ ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఆయిల్‌ఫెడ్ డీఓ భారతి పరిశీలన

నారాయణపురంలో ఆయిల్‌పామ్ తోటలను ఆయిల్‌ఫెడ్ డీఓ భారతి ఇటీవల పరిశీలించారు. గెలలు రాని, చనిపోయిన మొక్కలకు బదులు కొత్తవి ఇస్తామని చెప్పినట్లు రైతులు తెలిపారు. తెగుళ్లు సోకడంతో ఎదుగుదల లేక దిగుబడి తగ్గిందని ఆమె చెప్పగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారని వెల్లడించారు. అయితే, త్వరగా అధికారులు స్పందించి పరిహారం చెల్లించపోతే ఆందోళనలు చేపడుతామని రైతులు పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సత్తుపల్లి: ఆనాటి మధుర జ్ఞాపకాలు.. తరగతి గదుల్లో సంగతులను గుర్తుచేసుకుంటూ పూర్వవిద్యార్థులు ఆనందంగా గడిపారు. సత్తుపల్లిలోని ప్రభుత్వ బండి శోభనాచలం జూనియర్ కళాశాల 1987–89 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం సత్తుపల్లిలో శనివారం జరిగింది. ఈసందర్భంగా స్నేహితులంతా ఆప్యాయంగా పలకరించుకుని ఎవరేం చేస్తున్నారో తెలుసుకోవడంతో పాటు కుటుంబ విషయాలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరి, నాగళ్ల ప్రసాద్, చిల్లగుళ్ల వెంకటేశ్వరరావు, ఎండీ.షైబుద్దీన్, షాకీర్, ముక్తార్, ఆర్.శ్రీనివాసరావు, బొంతు కృష్ణారావు, కొండా, ఎస్‌కే.మహబు, కృష్ణకిషోర్, ఎండీ.రియాజ్, ఎం.డీ.ఖాజామియా, ఎస్‌కే.నజీర్, కొండల్‌రావు, కృష్ణార్జున్‌రావు, బుచ్చిరాజు, నరుకుళ్ల శ్రీను, పద్మజ, శైలజ, స్వరూపారాణి, జరీనా, రామసీత, పద్మజ్యోతిరెడ్డి, విజయనిర్మల, జయ పాల్గొన్నారు.

టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఈరునాయక్


ఈరునాయక్

కామేపల్లి: తెలంగాణ స్టేట్ ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ (టీఎస్‌టీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడిగా ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం బర్లగూడేనికి చెందిన ఈరునాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఖమ్మంలో వ్యవస్థాపక అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా ఈరునాయక్‌తో పాటు రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా మాలోత్ శివనాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఈరునాయక్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో జీఓ 3 ద్వారా ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు కల్పించాలని, జీఓ 317 ద్వారా బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి పదోన్నతులతో కూడిన బదిలీలు చేయాలని, ఏహెచ్‌ఆర్‌ఏ పెంపును అమలుచేస్తూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు.

చుట్టపుచూపుగా పలకరించిన 'లహరి'

తొలిసారి జిల్లాకు వచ్చిన స్లీపర్ బస్సు


కొత్తగూడెం బస్టాండ్‌లో లహరి బస్సు


బస్సు లోపల అధునాతన బెర్త్‌లు

చుంచుపల్లి: టీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యాన గత ఏడాది అందుబాటులోకి వచ్చిన లహరి బస్సు శనివారం జిల్లాకు వచ్చి వెళ్లింది. లహరి ఏసీ, నాన్ ఏసీ బస్సుల్లో ఒకటి, రెండు ఖమ్మం రీజియన్‌కు కేటాయిస్తారని ప్రయాణికులు ఆశించారు. అయినా కేటాయించలేదు. ఇంతలోనే సంక్రాంతి రద్దీ దృష్ట్యా హైదరాబాద్ డిపోకు చెందిన నాన్ ఏసీ లహరి బస్సును అధికారులు తొలిసారి భద్రాచలానికి పంపారు. శుక్రవారం రాత్రి భద్రాచలం చేరుకున్న ఈ బస్సు తిరిగి శనివారం ఉదయం 10.20 గంటలకు పాల్వంచ, కొత్తగూడెం, ఖమ్మం మీదుగా హైదరాబాద్ వెళ్లింది. ఈ సందర్భంగా కొత్తగూడెం బస్టాండ్‌కు వచ్చిన బస్సును ప్రయాణికులు ఆసక్తిగా తిలకించారు. 12 మీటర్ల పొడవైన స్లీపర్ బస్సులో లోయర్, అప్పర్ కలిపి 30 బెర్త్‌లు ఉండగా.. ప్రయాణికులకు ఉచిత వైఫై, మొబైల్ చార్జింగ్ సౌకర్యాలతో పాటు ప్రతీ బెర్త్ వద్ద రీడింగ్ ల్యాంప్ ఉన్నాయి. అలాగే, భద్రత కోసం సీసీ కెమెరాలు అమర్చగా, మంటలు చెలరేగితే అప్రమత్తం చేసేలా అత్యాధునిక ఫైర్ డిటెక్షన్, అలారం సిస్టం అమర్చారు. కాగా, త్వరలోనే భద్రాచలం, మణుగూరు డిపోలకు రెండేసి లహరి సర్వీసులను కేటాయించే అవకాశముందని ఆయా డిపోల మేనేజర్లు రామారావు, స్వామి తెలిపారు.

పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా నిలబడదాం


జెడ్పీ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: పాలస్తీనా ప్రజలకు భారత దేశ పౌర సమూహం అండగా నిలవాలని సీపీఐ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఇజ్రాయిల్, అమెరికా దేశాలు పాలస్తీనా ప్రజలపై చేస్తున్న దాడులను ఖండిస్తూ సీపీఐ ఆధ్వర్యాన శనివారం ఖమ్మంలోని జెడ్పీ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ ప్రతినిధులు డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, డాక్టర్ రవీంద్రనాథ్, రవిమారుత్, రెహానాబేగం, కాకి భాస్కర్, దేవిరెడ్డి విజయ్, శేషగిరిరావు, బండారు రమేశ్, ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, నాయకులు రాయల చంద్రశేఖర్, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, సీపీఎం నాయకులు యర్రా శ్రీకాంత్, న్యూడెమోక్రసీ నాయకుడు పాముల మోహన్‌రావు మాట్లాడారు. ఇజ్రాయిల్, అమెరికాలు పాలస్తీనాపై చేస్తున్న దాడులతో అక్కడి ప్రజలు నష్టపోతున్నారని వాపోయారు. పౌర స్థావరాలపైనా దాడులు జరగడం వలన అనేకమంది చనిపోతున్నారన్నారు. ఐరాస హెచ్చరికలు, ప్రపంచ దేశాల సూచనలను పరిగణనలోకి తీసుకోకుండా అమెరికా, ఇజ్రాయిల్ దుర్మార్గంగా వ్యవహరిస్తున్నందున ప్రజాస్వామిక వాదులందరూ పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలపాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గోకినపల్లి వెంకటేశ్వర్లు, యర్రా శ్రీనివాసరావు, సింగు నర్సింహారావు, పోటు కళావతి, ఆవుల అశోక్, ఝాన్సీ, మాదినేని రమేశ్, మెరుగు సత్యనారాయణ, జి.రామయ్య, ఆకుల గాంధీ, ఆజాద్, మస్తాన్, అబ్దుల్ రెహమాన్, వెంకటేశ్, మురళి పాల్గొన్నారు.

నేటి నుంచి రెండు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారంలో సంక్రాంతి పండుగ సందర్భంగా తెలంగాణ, ఏపీ రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు సూరేపల్లి శ్రీను వివరాలు వెల్లడించారు. ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని, విజేతలుగా వరుసగా రూ.10,016, రూ.7,016, రూ.5,016, రూ.4,016 బహుమతులు అందిస్తామని తెలిపారు. అలాగే, ట్రాక్టర్స్ రివర్స్ పోటీలు, ముగ్గుల పోటీలు కూడా ఉంటాయని, క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.